నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | HYDERABAD

'మెట్రో'లో ఆటవిడుపు

మెట్రో స్టేషన్లు ప్రయాణానికే కాదు..ఆట విడుపు కేంద్రాలుగానూ మారుతున్నాయి. కారిడార్-3(నాగోల్-రాయదుర్గం)లోని అమీర్‌పేట ఇంటర్ చేంజ్ తర్వాత వచ్చే మధురానగర్ స్టేషన్(తరుణి)లో నెట్ క్రికెట్ వేదికను ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తు (కాన్‌కోర్ లెవల్)లో టికెట్ కౌంటర్లతో పాటు షాపింగ్ కోసం రెండు వైపులా ప్రత్యేకంగా ఉన్న స్థలాన్ని వివిధ అవసరాలకు అందుబాటులో ఉంచారు. చాలా రోజులుగా ఖాళీగా ఉంటున్న ఈ స్థలాన్ని నెట్ క్రికెట్ కోసం అద్దెకిచ్చారు. దీంతో ఎంచక్కా..పెద్దలతో పాటు పిల్లలు సైతం క్రికెట్‌లో రాటుదేలుతున్నారు. స్థలం కిరాయికి ఇవ్వడం ద్వారా ఎల్ అండ్ టీ మెట్రో సంస్థకు ఆదాయమూ వస్తోంది.

-సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)

'మల్కాజిగిరి'కి.. 8 నామినేషన్లు

హైదరాబాద్, సికింద్రాబాద్ నిల్

మేడ్చల్, ఏప్రిల్18)నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మల్కాజిగిరి స్థానానికి సంబంధించి 8 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు.

ఆల్ ది బెస్ట్

తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థులు పద్మారావు గౌడ్, శ్రీనివాస్ యాదవ్, రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు బీ ఫామ్స్‌ను అందజేశారు. - సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి బీ ఫామ్ అందుకుంటున్న సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



బీ ఫామ్ అందుకుంటున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి

బీ ఫామ్ అందుకుంటున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, చిత్రంలో ఎమ్మెల్యేలు గాంధీ, సబితాఇంద్రారెడ్డి

బీ ఫామ్ అందుకుంటున్న హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే తలసాని, ఎమ్మెల్సీ మహమూద్ అలీ

బీ ఫామ్ అందుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, చిత్రంలో తలసాని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

> రాష్ట్రంలో బీజేపీ తీస్మార్ ఖాన్లు అని చెప్పుకునే బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, సోయం బాబూరావు వంటి వాళ్లను గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించింది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే.. అలాంటి బీఆర్ఎస్‌ను బీజేపీ బీటీమ్ అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు అంటే నవ్వాలో ఏడవాలో తెలియడంలేదు.
>
> - కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

బీజేపీని ఆపగలిగేది బీఆర్ఎస్సే

అరచేతిలో స్వర్గాన్ని చూపించిన కాంగ్రెస్

హామీలు నెరవేర్చలే.. ప్రజలే బుద్ధి చెబుతారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బంజారాహిల్స్: అరచేతిలో స్వర్గాన్ని చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న కోపంతో ఉన్న ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ..మతాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయాలు నడిపిస్తున్న బీజేపీని అడ్డుకునే శక్తి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉన్నదని, కాంగ్రెస్ పార్టీకి దేశంలో 40 సీట్లు కూడా రావని ఇండియా కూటమిలోని మమతా బెనర్జీ చెప్పడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. 'రాముడికి మొక్కుదాం..బీజేపీని తొక్కుదాం' అనే విధంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రజలను ఓట్లు అడగాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ తీస్మార్ ఖాన్లు అని చెప్పుకునే బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, సోయం బాబూరావు వంటి వాళ్లను గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించింది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులేనని..అలాంటి బీఆర్ఎస్‌ను బీజేపీ బీటీమ్ అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు అంటే నవ్వాలో ఏడవాలో తెలియడంలేదన్నారు. హామీల అమలు గురించి అడిగితే ఫోన్ ట్యాపింగ్ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు పలకడం ఖాయమన్నారు.

గెలిచే మొదటి సీటు సికింద్రాబాదే..

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదయితే ఆయన జయంతి రోజున 125 అడుగుల విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం దండ వేయకపోవడం ఆ మహనీయుడికి అవమానమేనని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి దండ వేయడానికి రేవంత్ రెడ్డికి అహం అడ్డువచ్చిందని, సిగ్గులేకుండా కేసీఆర్ కట్టించిన సెక్రటేరియేట్‌లో మాత్రం ఎలా కూర్చుంటారని ఎద్దేవా చేశారు. 2001 నుంచి ఉద్యమసారథి కేసీఆర్ వెంట ఉన్న పద్మారావు గౌడ్ ఎన్నికష్టాలు వచ్చినా వెనక్కి తగ్గలేదని, అలాంటి నికార్సయిన నేతను పార్లమెంట్‌కు పంపాలన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలిచే మొట్టమొదటి సీటు సికింద్రాబాదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్రనేత సోహైల్ తోపాటు కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, మన్నె కవితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. కష్టాలు తీరుస్తా

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కు లేదు

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: మల్కాజిగిరిలో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కులేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తాను అందరికీ అందుబాటులో ఉంటానని, మీ బస్తీలో కష్టాలు తీరుస్తానని చెప్పారు. హబ్సిగూడ, రామంతాపూర్ బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు ఆలోచించి..తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయా సమావేశాల్లో ఉప్పల్ ఇన్‌చార్జి జహంగీర్ పాషా, నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ బీవీచారి, సోమిరెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హబ్సిగూడ సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

తడాఖా చూపిస్తాం..

బీఆర్ఎస్‌ను బంపర్ మెజార్టీతో గెలిపిస్తాం

కాంగ్రెస్, బీజేపీ ఓటమియే లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ఎన్నికల ప్రచారం

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ నిరంకుశ విధానాలు నశించాలి.. డ్రైవరన్నల ఆత్మహత్యలపై స్పందించని కాంగ్రెస్‌ను ఓడించాలి.. తెలంగాణపై విషం చిమ్ముతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి. కాంగ్రెస్, బీజేపీ ఓటమియే ఎజెండాగా పనిచేస్తాం..' అంటూ నినదిస్తూ.. ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. తమ జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీల ఓటమియే లక్ష్యంగా చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆటో డ్రైవర్లు.. బీఆర్ఎస్‌ను బంపర్ మెజార్టీతో గెలిపిస్తామంటున్నారు. ఈ సందర్భంగా టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ఆటో డ్రైవర్లు సుమారు 25 మందికిపైగా మరణించినా.. పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడూ తాము రోడ్డు ఎక్కే దుస్థితి రాలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి.. కాంగ్రెస్, బీజేపీ నాయకుల చెంప చెల్లుమనిపిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లలంతా లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని వివరించారు. గ్రేటర్‌లో చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరిలో ప్రచారం నిర్వహించామని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పోలె నీరంజన్ మాట్లాడుతూ.. కరోనా వంటి క్లిష్ట సమయంలో ఉపాధి లేక దిక్కుతోచని స్థితిలో ఆటోడ్రైవర్లు కొట్టుమిట్టాడుతుంటే.. కేసీఆర్ సర్కార్ వాహన మోటార్ పన్ను రద్దు చేసి అండగా నిలిచిందని గుర్తు చేశారు. కరోనా సమయం రెండు త్రైమాసికాల పన్ను రద్దు చేసి కార్మికులకు భరోసాగా ఉందని వివరించారు. ఆటో డ్రైవర్లకు ఐదు లక్షల ప్రమాద బీమా కల్పించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనని అన్నారు. అప్పటి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో జేఎన్ఎన్‌యూఆర్ఎం స్కీంలో భాగంగా సంగారెడ్డి అమీన్పూర్‌లో 400 మంది ఆటో డ్రైవర్లకు ఇండ్లు కేటాయించుకోగలిగామని చెప్పారు. ఆటో డ్రైవర్ శాతం రమేశ్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేసేదే లేదని అంటున్నారన్నారు. ఎక్కడ చూసినా కేసీఆర్ మళ్లీ రావాలి అని జనం కోరుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో దాసు, చంద్రమౌళి, రమేశ్, నీజర్, సిద్దులు, కమ్మర్, శీను, జావేద్ తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వైరల్‌గా ఆటోవాలాల సూసైడ్ రిపోర్ట్..

ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్ట్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఉచిత బస్సు స్కీంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల వివరాలతో ' ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్ట్' సోషల్ మీడియాలో విరివిగా వైరల్ అవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం స్కీం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 25 మందికి పైగా ఆటో డ్రైవర్లు చనిపోయారంటూ లిస్ట్‌ను షేర్ చేస్తున్నారు. ఆ లిస్ట్‌కు పేపర్ క్లిప్పింగ్స్, టీవీ చానెళ్ల వీడియోలు జత చేస్తూ ఆధారాలతో షేర్ చేస్తున్నారు.

అర్జున్‌నగర్‌లో స్థానికులను ఓట్లు అభ్యర్థిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

నివేదితకు నిండు ఆశీర్వాదం

పాదయాత్రకు జననీరాజనం

కంటోన్మెంట్, ఏప్రిల్ 18: కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత చేపట్టిన పాదయాత్రకు అపూర్వస్పందన వచ్చింది. అడుగడుగునా ప్రజలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. జై కేసీఆర్, జోహార్ సాయన్న..లాస్యనందిత నినాదాలతో నివేదితకు సంపూర్ణ మద్దతు తెలిపారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి.. దీవెనలు అందించారు. కంటోన్మెంట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నానగర్, అర్జున్ నగర్, ఇందిరమ్మ నగర్‌లలో నివేదిత పాదయాత్ర చేశారు. ఏ ఇంటికీ వెళ్లినా జనమంతా ఆమెను అక్కున చేర్చుకొని.. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు.